నిధుల నిలిపివేత.. చెదిరిన కల

- కమలాపూర్ బస్టాండ్ నిర్మాణానికి నిధుల గ్రహణం
- మంత్రికి ఎమ్మెల్యే వినతిపత్రం ఇచ్చినా ముందుకు కదలని పనులు
- మధ్యలోనే నిలిచిపోయిన ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం
- ప్రయాణికులకు తప్పని తిప్పలు

మధ్యలోనే నిలిచిపోయిన ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం

కమలాపూర్, సెప్టెంబర్ 22 : ఎన్నో ఏండ్ల కల సాకారం అవుతుందని ఆశించిన ప్రయాణికులకు నిధుల నిలిపివేతతో నిరాశే మిగిలింది. కమలాపూర్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ (స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్)లో రూ.1.70కోట్లు కేటాయించింది. టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేపట్టాడు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. బస్టాండ్ నిర్మాణం నిలిచిపోయి ఏడాది కావస్తున్నా ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలు పట్టించుకోవడం లేదు. బస్టాండ్ నిర్మాణంతో కమలాపూర్ రూపురేఖలు మారుతాయని ఆశించిన ఇక్కడి ప్రజలకు నిరాశే మిగిలింది. నిర్మాణం పూర్తయితే చిరు వ్యాపారులకు ఉపాధి పెరుగుతుందని ఆశించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మారడం, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయకపోవడంతో అర్ధాంతరంగా ఆగిపోయింది.

నాలుగు జిల్లాలకు ఇక్కడి నుంచే ప్రయాణం

హుజూరాబాద్-పరకాల నాలుగు లైన్ల రహదారిపై కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, హనుమకొండ జిల్లాలకు చెందిన ప్రజలు నిత్యం కమలాపూర్ కేంద్రంగా రాకపోకలు సాగిస్తుంటారు. హనుమకొండ, ఎల్కతుర్తి, హుజూరాబాద్, జమ్మికుంట, పరకాల, భూపాలపల్లి పట్టణాలకు కమలాపూర్ నుంచి పోవాల్సిందే. ప్రయాణికులు బస్సుల కోసం రోడ్డుపైనే గంటల తరబడి ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ వేచిఉండాల్సిన దుస్థితి నెలకొంది. ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అసెంబ్లీ సమావేశాల సమయంలో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చినా స్పందన కరువైంది. బస్టాండ్ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు కలెక్టర్ దృష్టి సారించి నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు. కౌశిక్‌రెడ్డి ప్రతిపక్ష ఎమ్మెల్యే కావడంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం అదనంగా నిధులు కేటాయించేందుకు సుముఖత చూపడం లేదనే చర్చ సాగుతోంది.

అదనంగా నిధులు కేటాయిస్తేనే పనులు

ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి రూ.1.70కోట్లు గత ప్రభుత్వం మంజూరు చేయడంతో టెండరు దక్కించుకుని పనులు చేశా. నిధులు కేటాయించిన వరకు పనులు చేసిన. బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా. అదనంగా నిధులు కేటాయిస్తే గదులు, ప్రహరీ నిర్మాణం, బస్టాండ్‌లో ఫర్నిచర్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తాం.

– దామోదర్, కాంట్రాక్టర్

నిరుపయోగంగా మారిన జీపీ మినరల్ వాటర్ ప్లాంట్

జీపీ వాటర్ ప్లాంట్‌ను తెరిపించరూ..!

ఐనవోలు, సెప్టెంబర్ 22 : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ మినరల్ వాటర్ ప్లాంట్‌కు మరమ్మతు చేయకపోవడంతో ప్రజలు తాగు నీటికి ఇబ్బందు లు పడుతున్నారు. మండల కేంద్రంలోని మినరల్ వాటర్ ప్లాంట్ సంవత్సర కాలంగా నిరుపయోగంగా మారింది. ప్రజలు మినరల్ వాటర్ తాగాలంటే ప్రైవేట్ వాటర్ ప్లాంట్లను అశ్రయించాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ విక్రమ్ కుమార్ ప్రత్యేక దృష్టి సారించి మినరల్ వాటర్ ప్లాంట్‌కు మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు కేయూలో సింపోజియం

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 22 : కాకతీయ విశ్వవిద్యాలయ ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో 'డికేడల్ డెవలప్‌మెంట్ ఆఫ్ తెలంగాణ స్టేట్- ఇష్యూస్ అండ్ చాలెంజెస్' అనే అంశంపై సోమవారం విశ్వవిద్యాలయ సెనేట్ హాల్‌లో సింపోజియం నిర్వహిస్తున్నట్లు విభాగాధిపతి సురేశ్‌లాల్ తెలిపారు. ముఖ్యఅతిథిగా ఆచార్య హరగోపాల్, స్పెషల్ గెస్ట్‌గా ఎమ్మెస్సీ ఆచార్య కోదండ రామ్, ఆచార్య నరసింహారెడ్డి కీ నోట్ స్పీకర్‌గా, గౌరవ అతిథిగా రిజిస్ట్రార్ మల్లారెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

సరిత(ఫైల్)

ఐనవోలు, సెప్టెంబర్ 22 : చికిత్స పొందుతూ మహిళ మృతిచెందింది. ఎస్సై పీ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లింగమోరిగూడేనికి చెందిన బుర్ర సరిత(40) అనారోగ్యంతో బాధపడుతుండేది. శుక్రవారం ఇంట్లో పురుగులమందు తాగింది. కుటుంబ సభ్యులకు చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్చారు. చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందింది. భర్త శ్రీహరి, కుమార్తె స్వాతి, కుమారుడు వంశీ ఉన్నారు. మృతురాలి తండ్రి వడ్లకొండ కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యులను టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు పరామర్శించారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు

చెస్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 22 : వరంగల్ చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన చదరంగం పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఆదివారం హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన చదరంగ ఎంపిక పోటీల్లో సుమారు 100 మంది బాలబాలికలు పాల్గొన్నట్లు నిర్వహణ కార్యదర్శి కన్నా తెలిపారు. మూడు రౌండ్లు ముగిసేసరికి బాలికల విభాగంలో లక్ష్మి, శార్వాణి, ఆరాధ్య, జాన్వీ మూడు పాయింట్లతో ముందంజలో ఉన్నట్లు, బాలుర విభాగంలో దామెర అభినవ్‌సాయి, దేవాన్ష్, డిజితేష్ ముందంజలో ఉన్నట్లు తెలిపారు.

ప్రమాదకరంగా రోడ్డుపై మక్కలు

ఆత్మకూరు-తిరుమలగిరి రోడ్డుపై మక్కలు

ఆత్మకూరు, సెప్టెంబర్ 22 : తిరుమలగిరి- ఆత్మకూరు ప్రధాన రహదారిపై రైతులు మక్కలను ఆరబోయడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మక్కల పక్కన అక్కడక్కడ పెద్దపెద్ద రాళ్లను పెట్టడంతో రాత్రి వేళ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, రోడ్లపై ధాన్యం ఆరబోయకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని వివిధ గ్రామాల ప్రజల కోరుతున్నారు.

'వాగ్దేవి'లో స్నాతకోత్సవం

స్నాతకోత్సవంలో పాల్గొన్న అతిథులు

నయీంనగర్, సెప్టెంబర్ 22 : నగరంలోని వాగ్దేవి ఫార్మసీ కళాశాల స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ చల్లా శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కాళోజీ నారాయణ రావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ రిజిస్ట్రార్ సంధ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సీహెచ్ దేవేందర్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ సీహెచ్ వాహినీ దేవి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌వోడీలు శ్రవణ్ కుమార్, వెంటేశ్వర్లు, శరవణ భవ, కుమారస్వామి, మహేశ్ పాల్గొన్నారు.

'గోల్కొండ'లో మృతదేహం లభ్యం

కాజీపేట, సెప్టెంబర్ 22 : కాజీపేట రైల్వే జంక్షన్‌లో సికింద్రాబాద్ నుంచి గుంటూరు వెళ్తున్న గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో జీఆర్పీ పోలీసులు ఆదివారం మృతదేహాన్ని గుర్తించారు. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ప్రయాణికుల సమాచారం మేరకు రెండో నంబర్ ప్లాట్‌ఫారానికి వచ్చిన గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిపారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదని చెప్పారు. మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం దవాఖాన మార్చురీలో భద్ర పరిచినట్లు తెలిపారు. వారి బంధువులు కాజీపేట జీఆర్పీ స్టేషన్, లేదా 87126 58609 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

11మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

సుబేదారి/ఆత్మకూరు , సెప్టెంబర్ 22 : హనుమకొండ పోలీసు స్టేషన్ పరిధిలో అలంకార్ జంక్షన్ సమీపంలో సురేశ్ నివాసంలో పేకాడుతున్న ఆరుగురిని వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి రూ.40,170, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ లక్ష్మీటాకీస్ ప్రాంతానికి చెందిన కందాల శివకుమార్, హనుమకొండ వికాస్‌నగర్‌కు చెందిన పింగిళి రాజిరెడ్డి, గోపాల్‌పూర్‌కు చెందిన కల్వ విజేందర్, సూరం రాజు, బాలసముద్రానికి చెందిన కందూరు కృష్ణ, నయీంనగర్‌కు చెందిన మార్నేని మనోహర్ ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ఆత్మకూరు మండలం పెద్దాపురం శివారులో పేకాట శిబిరంపై పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేసినట్లు ఎస్సై పరమేశ్వర్ తెలిపారు. 9 మంది పేకాట ఆడుతుండగా, పెద్దాపురానికి చెందిన ఐదుగురు సుకినె కృష్ణ, పెంతాల రవీందర్, ఆకుల రవీందర్, మొండ్రాతి వెంకటేశ్వర్లు, గైరబోయిన సుధాకర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరి వద్ద రూ.3,650 స్వాధీనం చేసుకున్నామన్నారు. నలుగురు పరారైనట్లు ఎస్సై తెలిపారు.

బీఆర్ఎస్ పీచర గ్రామ అధ్యక్షుడిగా తిరుపతి

తిరుపతి

వేలేరు, సెప్టెంబర్ 22 : బీఆర్ఎస్ వేలేరు గ్రామ అధ్యక్షుడిగా పోలు తిరుపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ స్టేషన్ ఘన్‌పూర్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య నియామక పత్రాన్ని తిరుపతికి అందజేశారు.

'భగీరథ' తాగునీటికి మళ్లీ బ్రేక్

ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో సరఫరా బంద్

శాయంపేట, సెప్టెంబర్ 22 : మండలంలో మరోసారి భగీరథ తాగునీటికి బ్రేక్ పడింది. పక్షం రోజుల వ్యవధిలోనే ట్రాన్స్‌ఫార్మర్ రెండోసారి కాలిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. మండలంలోని జోగంపల్లి హెడ్‌వర్క్ నుంచి 24 గ్రామ పంచాయతీలకు జీఎల్‌బీఆర్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. శనివారం సాయంత్రం ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. దీంతో అన్ని గ్రామాలకు భగీరథ నీరు నిలిచిపోయింది. నీళ్లు రాకపోవడంతో వాటర్ ప్లాంట్ల వద్దకు పరుగులు పెడుతున్నట్లు ప్రజలు చెప్పారు. తరచు భగీరథ నీళ్లు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. రెండు రోజులుగా తాగునీరు రాకపోవడంతో బావులు, బోర్లను ఆశ్రయిస్తున్నట్లు చెప్పారు. అయితే కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను తెప్పించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఆదివారం జోగంపల్లికి చేరుకుంటుందని భగీరథ డీఈ శ్రీనివాస్ చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్ బిగించి తాగునీటిని త్వరలోనే అందిస్తామన్నారు.

రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలకు వినీల్‌రెడ్డి

విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేస్తున్న చినజీయర్‌స్వామి

హసన్‌పర్తి, సెప్టెంబర్ 22 : త్రిదండి చినజీయర్‌స్వామి వారి ప్రజ్ఞావికాస్ సంస్థ ఆధ్వర్యంలో ఆగస్టు 2న జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించింది. ఇందులో ఎల్లాపూర్ శివారులోని ఆర్బిట్ ఈ-టెక్నో స్కూల్ పదో తరగతి విద్యార్థి ఎం వినీల్‌రెడ్డి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ చిట్టిరెడ్డి భగవాన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించిన వినీల్‌రెడ్డికి శనివారం హైదరాబాద్ ముచ్చింతల్‌లోని తన ఆశ్రమంలో చినజీయర్‌స్వామి రూ.6వేలు, రెండో ర్యాంకర్ వీ స్నేహారెడ్డికి రూ.3వేలు అందజేసినట్లు వివరించారు.

ఆత్మీయ సమ్మేళనంలో గురువులతో పూర్వ విద్యార్థులు

44 ఏండ్లకు ఆత్మీయ కలయిక!

శాయంపేట, సెప్టెంబర్ 22 : చిన్నప్పుడు కలిసి చదువుకున్న వారందరూ 44 ఏండ్లకు కలుసుకున్నారు. శాయంపేటలోని జడ్పీ హైస్కూల్‌లో 1979-80లో పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు. గురువులను సత్కరించారు. కే రవికుమార్, అంకేశ్వరపు సాంబయ్య, సామల రవీందర్, వేముల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

దామెర, సెప్టెంబర్ 22 : మండలంలోని పులుకుర్తిలో విద్యుత్‌షాక్‌కు గురై ఎద్దు ఆదివారం మృతిచెందింది. జానపట్ల భద్రయ్యకు చెందిన ఎద్దు మేత కోసం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోకి వెళ్లింది. అక్కడ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న ఎర్తింగ్ వైరుకు ఎద్దు కాలు తగిలి విద్యుత్‌షాక్‌తో మృతిచెందింది. ఘటనా స్థలాన్ని విద్యుత్ శాఖ ఏఈ గుర్రం రమేశ్ సందర్శించారు. ఎద్దు విలువ రూ.90వేలు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం అందజేయాలని బాధిత రైతు కోరాడు.

'చెదిరిన స్వప్నం రాజీవ్' పుస్తకావిష్కరణ

హనుమకొండ, సెప్టెంబర్ 22 : వరంగల్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం 'చెదిరిన స్వప్నం రాజీవ్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. రచయిత ఏరుకొండ జయశంకర్‌ను సన్మానించారు. ఎంజేపీఆర్‌డీసీ ప్రిన్సిపాల్ హరిప్రసాద్, నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ సైదులు, వరంగల్ డీఏవో అనురాధ పాల్గొన్నారు.

టీచర్ల సర్దుబాటు ఉత్తర్వులను ఉపసంహరించాలి

టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భోగేశ్వర్

సమావేశంలో మాట్లాడుతున్న భోగేశ్వర్

హనుమకొండ, సెప్టెంబర్ 22 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఎక్కువున్నచోట టీచర్లు తక్కువ, టీచర్లు ఎక్కువున్న చోట పిల్లలు తక్కువగా ఉన్నారని, దీన్ని సర్దుబాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్లకు ఇచ్చిన అసంబద్ధ ఉత్తర్వులను వెంటనే ఉప సంహరించుకోవాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ ఉత్తర్వులు బడుల మూసివేతకు దారి తీసేలా ఉన్నాయన్నారు. ఆదివారం సుబేదారి ప్రభుత్వ పాఠశాలలో టీపీటీఎఫ్ ఖిలావరంగల్ మండల ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ పూర్ణచందర్ అధ్యక్షతన జరిగిన వరంగల్, ఖిలావరంగల్ మండలాల సంయుక్త సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలల్లో 11మంది పిల్లలున్న చోట ఇద్దరు ఉపాధ్యాయులు, 60 మంది ఉన్న చోట కూడా ఇద్దరే ఉపాధ్యాయులను ఉంచాలని ఆదేశించడం ఎంత అసంబద్ధంగా ఉందో విద్యాశాఖ అధికారులకు తెలియదా? అని ప్రశ్నించారు. ఐదు తరగతులకు పద్దెనిమిది సబ్జెక్టులను ఇద్దరు ఉపాధ్యాయులు ఏ విధంగా బోధిస్తారన్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులను పూర్తిగా దూరం చేసేలా ఈ నిబంధనలు ఉన్నాయన్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో 40 మంది పిల్లలు దాటితే ముగ్గురు టీచర్లను ఇచ్చి, ఇప్పుడు సర్దుబాటు పేరుతో తీయడం ఎందుకో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎనిమిదేళ్ల క్రితం రూపొందించిన కాలం చెల్లిన నిబంధనలనే ఇప్పటికీ అమలు చేయడం సరి కాదన్నారు. ఈ నిబంధనలు యథావిధిగా అమలు చేస్తే ఉన్నత పాఠశాలల్లోనూ ఉపాధ్యాయులపై మోయలేని భారం పడుతుందన్నారు. మూసివేసిన బడులను తెరిపిస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఉన్న బడులను మూసివేసే విధానాలను అమలు చేస్తున్నారని, చెబుతున్న మాటలకు చేస్తున్న పనులకు పొంతన ఉండాలని ఉపాధ్యాయులు భావిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో వరంగల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, పూజారి మనోజ్, ఉపాధ్యక్షులు స్వామి, వెంకట్, బుచ్చాచారి పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

'పాలిటికల్ సైన్స్ మంచి పరిశోధనలు, పరిపాలన అధికారులను అందించింది'

కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 22 : పొలిటికల్ సైన్స్ మంచి పరిశోధనలు, పరిశోధకులు, పరిపాలనా అధికారులను అందించిందని కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ పొలిటికల్ సైన్సు విభాగ సమావేశ మందిరంలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిశోధనలు సమాజహితంగా ఉండాలన్నారు. పూర్వవిద్యార్థులు విభాగాభివృద్ధికి కృషి చేయాలన్నారు. దూరవిద్య సంచాలకులు రామచంద్రం మాట్లాడుతూ పొలిటికల్ సైన్స్ డిపార్టుమెంట్ ఎంతోమందికి మార్గదర్శకం వహించిందన్నారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ మాట్లాడుతూ.. యూనివర్సిటీకి రుణపడి ఉంటానని, పొలిటికల్ సైన్సు జీవితాన్ని నేర్పిందన్నారు. విశ్రాంత ఆచార్యులు దినేశ్‌కుమార్, ప్రొఫెసర్ వీరన్న, ఏసీపీ జితేందర్‌రెడ్డి, రఘురాంరెడ్డి, పూర్వవిద్యార్థులు ఇండ్ల నాగేశ్వర్‌రావు, శ్రీరామ్, సారంగపాణి, పాఠ్యప్రణాళికా అధ్యక్షుడు కృష్ణయ్య పాల్గొన్నారు.

స్కూటర్ మైలేజీ చాలెంజ్ పోటీలో విజేతలుగా నిలిచిన వాహనదారులు

స్కూటర్ మైలేజీ చాలెంజ్‌కు విశేష స్పందన

వరంగల్, సెప్టెంబర్ 22 : నగరంలో హ్యాపీ యమహా ఆటో మోటర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కూటర్ మైలేజీ చాలెంజ్ షోకు విశేష స్పందన లభించింది. ఆదివారం యమహా కంపెనీకి చెందిన ఫ్యాసినో, రే జెడ్ఆర్ స్కూటర్ వాహనాలకు మైలేజీ చాలెంజ్ నిర్వహించారు. 25 మంది వాహనదారులు పాల్గొన్నారు. హై మైలేజీగా 114 కిలోమీటర్లు వచ్చిన వాహనదారుడికి మొదటి బహుమతి, 104 కిలోమీటర్ల మైలేజీ వచ్చిన వాహనాలకు ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో యమహా సర్వీస్ హెడ్ సత్యనారాయణ, సర్వీస్ ఇన్‌చార్జిలు కార్తీక్, మహేందర్, షోరూం యజమానులు ఎండీ రియాజ్ పాషా, సాజిద్, సేల్స్ ఏఎస్ఎం అక్షయ్ పాల్గొన్నారు.

'సమాధులను కూల్చిన వారిపై కేసు నమోదు చేయాలి'

పెద్దమ్మగడ్డ శ్మశానవాటికలో కూల్చిన సమాధులను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 22 : పెద్దమ్మగడ్డలోని దళితుల శ్మశానవాటికలోని సమాధులను కూల్చిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. ఆదివారం శ్మశానవాటికలో కూల్చిన సమాధులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో భూ కబ్జాదారులు ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నారని, 1971లో నల్లెల కట్టయ్య తనకు చెందిన భూమిని నాలుగు ఎకరాలు రాసి ఇచ్చారని, అప్పటినుంచి ఈ స్థలంలోనే సమాధులు కడుతున్నారని తెలిపారు. సమాధులపై కన్నుపడిన కిషన్‌రాజ్, ప్రభాకర్, జ్యోతి కలిసి దొంగ కాగితాలు సృష్టించి ఈ భూమి తనదని కోర్టులో కేసు వేసి, ఇప్పుడు పెద్దమ్మగడ్డకు చెందిన దళితుల సమాధులను నేలమట్టం చేసి ప్రహరీని కూల్చారని, వెంటనే వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. నార్త్ మండల కమిటీ కార్యదర్శి గాదె రమేశ్, మంద మల్లేశం, బొట్ల కుమారస్వామి, స్వయంకృషి మహిళా సంఘం నాయకులు తీగల శుభ, భాగ్యమ్మ, రాధ, సుచరిత, అనిత, సీపీఎం నాయకులు స్వప్న, తార, నవీన్, రవి, శ్యామ్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఐఅండ్‌పీఆర్ విశ్రాంత ఉద్యోగులు

హనుమకొండ, సెప్టెంబర్ 22 : వడ్డేపల్లి జంక్షన్ సమీపంలోని శ్రీమాత బాంక్వెట్ హాల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా ఐఅండ్‌పీఆర్ విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. సమాచార పౌర సంబంధాల శాఖ పూర్వ సంచాలకులు రాజమౌళి మాట్లాడుతూ.. శాఖా పరంగా జిల్లా స్థాయిలో ఇలాంటి ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయడం తెలంగాణ రాష్ట్రంలో ప్రప్రథమమని పేర్కొన్నారు. ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విశ్రాంత అధికారులు, సిబ్బంది తమ అనుభవాలు, అభిప్రాయాలను పంచుకున్నారు. కార్యక్రమంలో విశ్రాంత అధికారులు పాకాల భాస్కర్, మూర్తుజా, వెంకట నారాయణ, మల్లయ్య పాల్గొన్నారు.

ముసాయిదా ఓటరు జాబితాపై 361 అభ్యంతరాలు

హనుమకొండ, సెప్టెంబర్ 22 : గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి విడుదల చేసిన ముసాయిదా ఓటరు బాబితాపై జిల్లా వ్యాప్తంగా అభ్యంతరాలు వెల్లువెత్తాయి. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఈ నెల 13వ తేదీన జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ముసాయిదా ఓటరు జాబితాను ప్రదర్శించింది. జాబితాపై శనివారం వరకు అభ్యంతరాలు స్వీకరించా రు. జిల్లా వ్యాప్తంగా 361 అభ్యంతరాలు వచ్చినట్లు పంచాయతీరాజ్‌శాఖ అధికారులు తెలిపా రు. ముసాయిదా ఓటరు జాబితా రూపొందించే క్రమంలో తప్పులు జరిగాయని పలువురు అసహనం వ్యక్తం చేశారు. ఒకే కుటుంబానికి చెందిన వారు ఒకే వార్డులో ఉండాలి. కానీ వీరు పేర్లు వేర్వేరు వార్డుల్లో, వేర్వేరు జీపీల్లో, డబుల్ డబుల్ వచ్చినట్లు అభ్యంతరం తెలిపారు. ఇదే విషయంపై జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్‌ను ఫోన్‌లో సంప్రదించగా, అభ్యంతరాలను ఈనెల 26వ తేదీలోగా పరిష్కరించి 28న తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామని తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లాలోని 12 గ్రామీణ మండలాల పరిధిలోని 210 గ్రామ పంచాయతీల్లోని 1986 వార్డుల్లో 3,65,828 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,78,819 మంది పురుషులు, 1,87, 007 మహిళలు, ఇద్దరు ఇతరులు ఉన్నారు. అభ్యంతరాల పరిష్కారం తర్వాత ఓటర్ల సంఖ్య మారుతుందని పంచాయతీరాజ్ అధికారులు తెలిపారు.

'కేంద్రం ఒక ఎస్సీ వర్గానికి మొగ్గుచూపడం సరికాదు'

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఐలయ్య

కాజీపేట, సెప్టెంబర్ 22 : కేంద్ర ప్రభుత్వం ఒక ఎస్సీ వర్గం వైపే మొగ్గు చూపడం బాధాకరమని, వర్గీకరణ మాలల మనోభావాలను దెబ్బతీసేలా ఉందని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ బన్న ఐలయ్య పేర్కొన్నారు. కాజీపేట 47వ డివిజన్ బాపూజీనగర్ పోచమ్మగుడి ఆవరణలో తేజోమయి మాల కుల సంక్షేమ సంఘం పట్టణాధ్యక్షుడు మర్యాల కృష్ణ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక బహిరంగ సభ సన్నాహక సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, కులాల ప్రాతిపదికన పూర్తిగా పరిశీలించిన తర్వాతే తుది తీర్పు ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. కోర్టు తీర్పు మాలలకు అన్యాయం జరిగేలా, వర్గీకరణకు హాని కలిగించేలా ఉందన్నారు. మళ్లీ పునఃపరిశీలన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సమస్యలు పరిష్కారం కావాలంటే మాలలు ఒకతాటిపైకి రావాలని,